# పెళ్ళాం తప్పిపోయింది

ఉత్పల వరదరాజా

పెళ్ళాం అనే శాల్తీని కలిగివుండటంలో ఎంత యిబ్బంది వుందో పార్వతీశానికి పెళ్ళాం పోయాక తెలియటం విశేషం. పెళ్ళాన్ని చూసినపుడల్లా అతనికి రైల్వే గూడ్సు వాగెను గుర్తుకు వస్తుంది. దీనికి కారణాలు రెండు. ఒకటి అతను అందులో పని చేయటం, రెండు గూడ్సు వాగెనుకు విసుగుండదు పెళ్ళానికీ విసుగుండదు.

సరె- యింతకీ పార్వతీశానికి వచ్చిన కష్టం ఏమిటి?

గత సాయంకాలం తను ఆఫీసు నుండి వచ్చేసరికి తను అగ్నిసాక్షిగా పెళ్ళాడిన వారిజాక్షి అంతర్ధానం కావటం జరిగింది.,

రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో పోలో మంటూ పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి శోకరాగంతో ఒక రిపోర్టు యిచ్చాడు.

అక్కడ నుండే అసలు కథ ప్రారంభమయింది.

ఇనస్పెక్టర్ లక్కవరం సంతలో షికారు తిరిగే ఆబోతు తమ్ముడులా వున్నాడు. వివరాలన్ని తాపీగావిని బంగారపు బ్రాండ్ సిగరెట్టు వెలిగించి "నీకు పెళ్ళి అయి ఎంత కాలమయింది?" అడిగాడు.

"ఆరేళ్ళయిందండి"

"నీభార్య కట్నం ఎంత తెచ్చింది?"

"అవి పర్సనల్ విషయాలు.. మీకెందుకు చెప్పాలి?"

"యు ఆర్ అండర్ అరస్టు" ఇనస్పెక్టర్ ఘర్జించటంతో పార్వతీశం ప్రాణాలు పేలిపోయాయి.

'ఎ...ఎ.... ఎందుకు?' కంగారుగా అడిగాడు.

"ఎందుకేమిటోయ్ నీవు వరకట్నం కొరకు నీ భార్యను మర్డర్... హత్య చేశావ్" ఇనస్పెక్టర్ అనటంతో గతుక్కుమన్న పార్వతీశం "శ్రీరామచంద్ర ప్రభో యిదేం పీడండి బాబు. నా పెళ్ళాం కనిపించడంలేదని నేను అఘోరిస్తుంటే దిక్కుమాలిన అభియోగం నా నెత్తిన అభిషేకిస్తారే!"

"నోర్ముయ్.... అడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పు. నీ భార్య వయస్సు"

"యిప్పుడా? పెళ్ళి అయినప్పుడా?"

"యిప్పుడు"

"యిరవై మూడున్నర సంవత్సరాలండి"

'అయితే నీవు ఖచ్చితంగా వరకట్నం గురించి చంపి వుంటావు

''అయ్యో! ఆమె మా మేనమామకూతుర్రండి. పైసా కట్నం పుచ్చుకోలేదు

'సరె రెండో పాయింట్‌కి వస్తున్నా'.

"రాండి".

"మీ ఆవిడ తరచు వీధిలో నిలబడి పరాయి మగాళ్ళను చూస్తుంటుందా?"

'ఛ... ఛ... పెద్ద అపభ్రంశం మాటలు అంటున్నారు. ఇనప్పెట్టి దగ్గరమార్వాడీలా పొయ్యి ముందు కూర్చోవటం తప్ప వీధి బాగోతాలు తెలియవండి.'

"నీ భార్యను ప్రేమిస్తున్నావా,

"యిదేం ప్రశ్న మహాప్రభూ..... ఎక్కడయినా పెళ్ళాంతో ఎంచక్కా కాపురం చేస్తుంటారు గాని, ప్రేమిస్తారటండి".

"సరె.... నీ భార్య – అందంగా వుంటుందా?"

"వుండదండి".

"వుండదా?"

"వుండదండి"

"మరెందుకు పెళ్ళి చేసుకున్నావ్?"

'లెక్క తప్పింది లెండి. పెళ్ళితో పెళ్ళాం వస్తుంది అనుకున్నాను గాని, అందంగా వుండాలనుకో లేదండి. అసలు యీ పెళ్ళాం వల్ల లాభమా? నష్టమా? అని నిన్న రాత్రి కూడా ఆలోచించాను ఆమధ్య వాళ్ళ అమ్మ నాన్నతో తిరుణాలకి వెళ్ళి తాపీగా తల నీలాలు యిచ్చి వచ్చింది. ఆ మనోహర రూపం చూసి ఆరురోజులు మంచం ఎక్కాను."

"అయితే నీ భార్య అందంగా వుండదు?

అందుకే నీ భార్యను కాదని పరాయి ఆడదానితో శృంగారం వెలిగిస్తూ మర్డర్ చేశావ్"

"మర్డరా?"

"యస్ ఫస్ట్ డిగ్రీ మర్డర్"

"యిదేం ఖర్మండి పోలీసు వారూ! నా పెళ్ళాం కనిపించ లేదని నేను మొరపెట్టు కుంటానికి వస్తే నామీద మర్డర్ నేరం వేస్తున్నారు."

"దేశం ఎలావుంది?"

"మబ్బు పట్టి వుంది".

"కాదు. రోజుకో వరకట్న మరణం, క్షణానికి ఒక ఆత్మహత్య, నిమిషానికో మానభంగం. సో.... యీ దారుణాలలో ఎవరు హంతకులు? మనసు పాడయి పోయి బుర్ర తిరిగి పోతోంది."

"తిరగ నివ్వకండి... మీ బుర్రతో మీకు చాలా పనుంది" -

"అవును" వులిక్కిపడి "ఏమిటి"? నన్నే కాకా పడుతున్నావ్.... కమ్‌టుద పాయింట్. మీ ఆవిడ, నీవు ఎందుకు పోట్లాడు కున్నారు".

"లేదండి.... మా ఆవిడతో నేను పోట్లాడనండి"

"బుద్ధిమంతుడివా?"

"అంతే–అనుకుంటారు.... సార్ భగవంతుడి సాక్షిగా యీ పోలీస్ స్టేషన్ మీద ప్రమాణం చేసి చెపుతున్నాను. నా భార్య కనిపించటం లేదండి."

"నిన్ను లాకప్ లో వేసి నాలుగు వుతికితే అదేకనిపిస్తుంది".

"ఆఁ"

"ఆఁ.... ఒక సారి గొర్రెలగోకవరంలో యిలాంటి కేసే జరిగింది. నీలాంటి వాడు తన భార్యను మర్డర్ చేసి గోనె సంచిలో పెట్టి 'నా పెళ్ళాం మాయమయింది' అంటూ రిపోర్టు యిచ్చాడు. నా దర్యాప్తులో తేలిపోయింది..."

"మా యింట్లో గోనె సంచులు లేవండి".

"చూడు మిష్టర్ పార్వతీశం నీవు నీ భార్యను దారుణంగా మర్డర్ చేశావ్! యీ విషయంలో మేము నిజాలు తెలుసుకోవాలి. అలా తెలుసుకోవాలంటే నీవు అరెస్టు కావాలి. అంటే మేము నిన్ను తాత్కాలికంగా లాకప్‌లో పికప్ చేయాలి".

"నా మాట వినండి".

"వినను... ఓయ్ త్రీనాట్ ఫోర్".

"నేను ఫోర్ నాట్ త్రీ సార్" అన్నాడు హాజరయిన కానిస్టేబుల్.

"యితన్ని లాకప్‌లో వేసి అడ్రసు తీసుకో" అన్నాడు తాపీగా.

"యస్ సర్"

ఫోర్ నాట్ త్రీ బలవంతంగా లాకప్ లోకి తోస్తూ వుంటే చెట్టంత కోలాహలం చేశాడు పార్వతీశం "అయ్యా పోలీసు వారూ. నా మాట వినండి.... నా భార్యను నేనేం చేయలేదండి.... కనిపించలేదండి అంటే....

"మిస్టర్ పార్వతీశం.... నీవు నోరు మూసుకొని లాకప్‌లో పడుండు కాగల కార్యం గంధర్వులు చూస్తారు."

"వారెవరు?"

"మేమే" చిద్విలాసంగా నవ్వాడు యస్. ఐ.


★ ★ ★ ★ ★

ఆ అరుపుతో అదిరిపోయాడు ఇనస్పెక్టర్.

తటాలున కుర్చీలో నుండి లేచాడు. అదే సమయంలో బయట నుండి లోపలకు విసిరినట్టు

లోపల పడ్డాడు ఫోర్ నాట్ త్రీ కానిస్టేబుల్.

అవాక్కయ్యాడు ఇనస్పెక్టర్.



భూమి కృంగినట్టు, పోలీస్ స్టేషన్ కదిలిపోయినట్టు కంగారయ్యాడు.

సరిగ్గా అదే సమయంలో లోపలకు వచ్చింది ఒక స్త్రీ ఆకారం. "మా వారు కనిపించలేదు" అంది.

పార్వతీశం ముఖం నూట యిరవై డిగ్రీల టెంపరేచర్ ప్రసాదించే సూర్యుడులా వెలిగిపోయింది.

"యిదిగో నేను యిక్కడ వున్నానే'!

"యిక్కడెందు కున్నారు?"

జరిగింది చెప్పాడు పార్వతీశం. ఆమె ముఖం వివర్ణ మయింది. "యింతలో ఏ కొంప మునిగిందని యిలా వచ్చారు. నిన్న బస్‌లో పిన్నిగారింటికి వెళ్ళాను. ఆవిడకు గుండె నొప్పి. అసలు ఎప్పుడో పోవలసిన ప్రాణం పోటానికి ఓపిక లేక అలా ఆగిపోయింది." అంటూనే లాకప్ రూం తలుపును రెండు చేతులో బలంగా లాగటంతో తలుపు వూడి ఆమె చేతుల్లోకి వచ్చింది.

అంతే!- యస్సై గుండె గొంతుకలోకి వచ్చి లోలకంగా వూగిసలాడింది" ఎవడయ్యా నీకు వుద్యోగం యిచ్చింది."

"యిచ్చినోడు చచ్చాడమ్మా"

"బ్రతికివుంటే యిప్పుడు చచ్చేవాడు. పెళ్ళాం కనిపించ లేదని మొగుడు వస్తే మూసెయ్యటం, మొగుడు కనిపించ లేదని పెళ్ళాం వస్తే రేప్ చేయటం.... ఛ ఛ..." అంటూ పార్వతీశాన్ని వెంట పెట్టుకొని తాపీగా వెళ్ళిపో సాగింది.

ఇనస్పెక్టర్ బరువుగా నిట్టూర్చి "యిదిగో త్రీనాట్ ఫోర్" పిలిచాడు.

"నేను ఫోర్ నాట్ త్రీనండి"

"అదేలేవయ్యా.... యిలాంటి పెళ్ళాం తప్పిపోయిందని పోలీస్ స్టేషన్‌కి వచ్చాడేమిటయ్యా!?" అన్నాడు.

"బహుశా అతగాడి పెళ్ళాం ఎవర్నయినా మర్డర్ చేసి వుంటుందేమో నని వచ్చి వుంటాడు!"

"అంతేనంటావా!?" విస్తుపోయాడు.

పెళ్ళాం అనే శాల్తీని కలిగి వుండటంలో ఎంత ఆనందం వుందో భార్య వెంట నడుస్తున్న పార్వతీశానికి తెలిసింది. □